సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 19 : ఏప్రిల్ : 2025



బోనస్.. భరోసా!

రాష్ట్ర ప్రభుత్వం నన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ప్రకటించడంతో జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. IIలో



వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా జిల్లాలో పలుచోట్ల ముస్లింలు నిరసన తెలిపారు. IIIలో

గరిష్టం / కనిష్టం
41° / 27°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్ర వారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజు లు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం గావించారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, కుంకుమ పూజలు, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి పాల్గొన్నారు.

22, 25 తేదీల్లో టీబీజీకేఎస్ నిరసనలు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల వేలం, సింగరేణి ప్రైవేటీకరణ యత్నాలను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న సింగరేణివ్యాప్తంగా గనులు, డిపార్ట్‌మెంట్ వద్ద, 25న జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టి, వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.


ఇప్ప పూల సేకరణ



అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన ఇప్ప పూవు

అశ్వాపురం: మండలంలోని అటవీ ప్రాంతంలో గిరిజనులు ఇప్ప పూలు సేకరిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం నుంచి వర్షాలు కురిసే వరకు గిరిజన గ్రామాల్లో ఇప్ప పూల సేకరణ సాగుతుంది. తెల్లవారుజామునే అడవుల్లోకి వెళ్లి సేకరించి ఇళ్లకు తెచ్చి ఎండబడతారు. అనంతరం కేజీ రూ.15 నుంచి 20చొప్పున విక్రయిస్తుంటారు. వీరి నుంచి జీసీసీ అధికారులు, కొందరు ప్రైవేటు వ్యాపారులు కొనుగోళ్లు చేపడతారు.

వేదగణితంలో విద్యార్థి ప్రతిభ



సాత్విక్

అశ్వారావుపేటరూరల్: వేద గణితం శిక్షణలో అశ్వారావుపేటకు చెందిన సిద్ధాంతపు సాత్విక్ సాయి కుమారాచార్యులు ప్రతిభ కనబరిచాడు. ఏపీలోని విశాఖపట్నానికి చెందిన వాగ్దేవి కళాపీఠం ఆధ్వర్యంలో గడిచిన ఆరు నెలలుగా అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్‌నెట్ ద్వారా వేద గణితంపై శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ ముగిశాక పరీక్ష నిర్వహించి, శుక్రవారం ఫలితాలు విడుదల చేశారు. కాగా సాత్విక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. ఈ మేరకు సర్టిఫికెట్‌ను వాగ్దేవి కళాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ వెంపరాల వెంకట లక్ష్మీ శ్రీనివాసమూర్తి, వేదగణితం శిక్షకురాలు జి.సత్య ఈ మెయిల్ ద్వారా పంపించారు.

ధాన్యం కాపాడేదెట్లా..?



టార్పాలిన్లు లేక గోనె సంచుల పట్టాలపై ఆరబోసిన ధాన్యం

పట్టాల్లేక అకాల వర్షంతో తడిసిపోతున్న వడ్లు

- ఏటా యాసంగి సీజన్‌లో రైతులకు తప్పని ఇక్కట్లు
- గతంలో సబ్సిడీపై రైతులకు టార్పాలిన్లు మంజూరు
- 2017 నుంచి పంపిణీ నిలిపివేసిన ప్రభుత్వం

పాల్వంచరూరల్: అకాల వర్షాల నుంచి పంట ఉత్పత్తులను రక్షించుకునేందుకు రైతులు ఇక్కట్లు పడుతున్నారు. ధాన్యం, మిర్చి కల్లాల్లో ఆరబెడితే వానలకు తడిసిపోతున్నాయి. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటే రైతుల గుండెలు గుభేల్‌మంటున్నాయి. టార్పాలిన్ పట్టాలు కప్పుకుని కాపాడుకుందామంటే ప్రభుత్వం వాటిని సరఫరా చేయడం లేదు. దీంతో ఏటా యాసంగి సీజన్‌లో రైతులు నష్టపోతున్నారు.

గతంలో 50 శాతం సబ్సిడీపై..

యాసంగి సీజన్‌లో అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 30,557మంది రైతులు 74,600 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి తడిసిపోయింది. గతంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీపై టార్పాలిన్లు (పట్టాలు) అందించారు. మార్కెట్‌లో టార్పాలిన్ ధర రూ.2500 ఉంటే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.1250కు ఇచ్చేది. దీంతో రైతులు అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకునేవారు. కానీ 2017 నుంచి టార్పాలిన్ పట్టాల పంపిణీ నిలిపివేశారు. దీంతో ఎనిమిదేళ్లుగా టార్పాలిన్ల పట్టాల కొరత రైతులను వేధిస్తోంది.

అద్దెకు తీసుకుందామంటే అధిక ధర

ధాన్యం తడవకుండా పరదాలను రైతులు అద్దెకు తెచ్చి వినియోగించుకుంటున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటే భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు పట్టణాలకు వెళ్లి పరదాలను అద్దెకు తెస్తున్నారు. ఒక్కో పరదాకు రోజుకు రూ.20పైన చెల్లించాల్సివస్తోంది. దీనికి తోడు రానుపోను చార్జీలు కలిపి రైతులపై భారం పడుతోంది.

ప్రైవేటులో నాణ్యతలేని పరదాలు

ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. సమీప పట్టణాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ఖమ్మం, వరంగల్, విజయవాడ, హైదరాబాద్‌లకు వెళ్లాల్సి వస్తోంది. ప్రైవేటుగా కొనుగోలు చేసిన మన్నిక, నాణ్యత ఉండటం లేదని, నాసిరకంగా ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు పంటలు తడిసిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఇప్పటికీ పాతవి, పాడైన టార్పాలిన్లనే వినియోగిస్తున్నారు. కొందరు గోనె సంచులను ఉపయోగిస్తున్నా పెద్దగా ఉపయోగం ఉండటంలేదు. ధాన్యం తడిసి మళ్లీ తేమశాతం పెరిగి కొనుగోలు కేంద్రాల్లో ఇక్కట్లు తప్పడం లేదు.

అధిక ధరలకు కొన్నా..



ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నాం. అవి తక్కువ పొడవు, నాణ్యతతో ఉంటున్నాయి. వర్షాలు కురిసినప్పుడు ఆ టార్పాలిన్లు ధాన్యం తడవకుండా ఆపలేకపోతున్నాయి. మా ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సబ్సిడీ టార్పాలిన్లను ప్రభుత్వం అందించాలి.

– కల్లెం వెంకట్‌రెడ్డి, రైతు

పంట తడిసిపోతోంది



టార్పాలిన్ పట్టాలు లేకపోవడంతో గోనె సంచులతో పట్టాలు కుట్టించుకుని నియోగించుకుంటున్నాం. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన టార్పాలిన్లు ఎంతో నాణ్యంగా ఉండేవి. ఇప్పుడు అవిలేని కారణంగా అకాల వర్షాలకు పంటలు తడిసి నష్టం వాటిల్లితోంది.

– బి.సాములు, రైతు

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



సబ్సిడీపై టార్పాలిన్ల అందించే పథకాన్ని ఐదారేళ్ల క్రితమే ప్రభుత్వం నిలిపేసింది. అప్పటికే జిల్లా వ్యాప్తంగా కొత్తగా 24 వేల టార్పాలిన్ల డిమాండ్ ఉండేది. ఇప్పుడు మరింత పెరిగింది. ఈ సమస్యను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం.

– బాబూరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

కరుణామయుడా..

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- ప్రత్యేక ప్రార్థనలు, శాంతి ర్యాలీలు



పాల్వంచలో క్రీస్తు సిలువ మార్గం ప్రదర్శన చేపట్టిన క్రైస్తవులు

పాల్వంచ/కొత్తగూడెంటౌన్: క్రీస్తును సిలువ వేసిన రోజును స్మరించుకుంటూ క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా చర్చిలు, మందిరాల్లో ప్రార్థనలు చేశారు. పలు ప్రాంతాల్లో క్రీస్తు సిలువ వేసిన ప్రదర్శనలు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టారు. పలువురు గీతాలను ఆలపించారు. కొత్తగూడెంలోని సెయింట్ అంద్రుస్, బేతానియా, సెయింట్ థామస్ చర్చిలు, పాల్వంచలోని సీఎస్ఐ, ఆరోగ్య మాత చర్చిల్లో వేడుకలు జరిగాయి. పాల్వంచ ఆరోగ్యమాత చర్చి(ఆర్‌సీఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన సిలువ మార్గ ప్రదర్శన చూపరులను కంటతడి పెట్టించింది. చర్చి నుంచి బీసీఎం రోడ్‌లో సీ కాలనీ సెంటర్, అంబేద్కర్ సెంటర్, దమ్మపేట సెంటర్ మీదుగా శ్రీనివాస కాలనీ కార్మెల్ గిరి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రదర్శన సాగింది. రాత్రి భక్తులు కార్మెల్ గుట్టకు అధిక సంఖ్యలో చేరుకుని ప్రార్థనలు చేశారు. గిడియోన్ సంస్థ ఆధ్వర్యంలో బైబిళ్లు, న్యూలైఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చల్లటి పానీయాలు పంపిణీ చేశారు.

చిత్రమాలిక IIవ పేజీలో

వర్షం వస్తుంది.. జాగ్రత్త!

- రైతులను అప్రమత్తం చేసేలా సూచనలు
- అందుబాటులోకి వెదర్ యాప్

ఖమ్మం సహకారనగర్: పది రోజులుగా ఏ రోజు ఎక్కడ గాలిదుమారం వస్తుందో, వర్షం కురుస్తుందో చెప్పలేని పరిస్థితి ఎదురవుతోంది. దీంతో కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యం తడిసి నష్టం ఎదురవుతోంది. అధికారులు సైతం వర్షసూచనలను రైతులకు చేరవేసే పరిస్థితి లేదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేలా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏ జిల్లాలో, ఏ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రాంతాన వర్షం కురుస్తుందనే సమాచారాన్ని తెలుసుకునేలా రూపొందించిన వెదర్ యాప్ శుక్రవారం అందుబాటులోకి వచ్చిందని ఖమ్మం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి(డీఎస్ఓ) చందన్‌కుమార్ తెలిపారు. ప్రతీ రోజు ఏ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపాన వర్షం కురిసే అవకాశముందో యాప్ ద్వారా గుర్తించి, జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అప్రమత్తం చేయనున్నారు.

అంతా సవ్యంగానే ఉందా?!

- పాఠశాలల స్థితిగతులపై ఏటా యు–డైస్ సర్వే
- ఇందులో వివరాలపై థర్డ్ పార్టీ ద్వారా పరిశీలన



రేగులగండిలో వివరాలు సేకరిస్తున్న డైట్ విద్యార్థిని

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, బోధన ఎలా జరుగుతోంది.. ఇంకా ఏమేం వసతులు కావాలనే సమాచార సేకరణకు కేంద్ర ప్రభుత్వం ఏటా యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యు–డైస్) సర్వే చేయిస్తోంది. ప్రతీ ఏడాది అక్టోబర్, నవంబర్‌లలో ఈ సర్వే చేస్తుండగా.. ఇందులో నమోదైన వివరాలను సరిచూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం థర్డ్ పార్టీ సర్వేకు నిర్ణయించింది. డైట్ కళాశాల విద్యార్థులతో చేయిస్తున్న ఈ సర్వే 15వ తేదీన మొదలుకాగా 21వ తేదీతో ముగియనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డైట్ కళాశాల ఒకటే ఉన్నందున భద్రాచలం ఐటీడీఏలోని బీఈడీ కళాశాల విద్యార్థులను కూడా సర్వేకు వినియోగించుకుంటున్నారు.

యు–డైస్ సర్వే ఇలా..

ఏటా కేంద్ర ప్రభుత్వం యు–డైస్ పేరిట సర్వే నిర్వహిస్తుంది. పాఠశాలల్లో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అక్కడ అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ వివరాల ఆధారంగా సదుపాయల కల్పనకు కేంద్రం నిధులు విడుదల చేస్తుంది.

కొన్ని తేడాలు..

కేంద్రం చేయించిన యు–డైస్ సర్వేలో పలు పాఠశాలల్లో మౌలిక వసతులు లేవని తేల్చారు. టాయిలెట్లు, డిజి టల్ తరగతి గదులు, తాగునీటి సదుపాయం లేవని గుర్తించారు. కానీ రాష్ట్రప్రభుత్వం మాత్రం విద్యారంగంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నా వివరాలు ఇలా నమోదు కావడానికి సర్వే లోపాలే కారణమని భావిస్తున్నట్లు సమాచారం. దీంతో థర్డ్ పార్టీ సర్వేకు నిర్ణయించినట్లు తెలిసింది.

డైట్ విద్యార్థులతో..

డైట్ విద్యార్థులతో థర్డ్ పార్టీ సర్వే కొనసాగుతుండగా, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ పర్యవేక్షిస్తున్నారు. యు–డైస్‌లో ఏం నమోదు చేశారు.. వాస్తవ పరిస్థితులు ఏమిటో పరిశీలించి తేడాను నివేదికలో పొందుపరుస్తున్నారు. ఖమ్మం సమీపాన ఓ పాఠశాలలో ర్యాంప్ లేకున్నా ఉన్నట్లు నమోదు చేశారని, మరుగుదొడ్లు ఉన్నా లేనట్లుగా పేర్కొన్నారని గుర్తించినట్లు సమాచారం. అలాగే, చిన్న మరమ్మతులు అవసరమైతే భవనాలు శిథిలావస్థకు చేరాయని యు–డైస్ సర్వేలో పొందుపర్చారని తేల్చినట్లు తెలిసింది. కాగా ఈ సర్వేతో వాస్తవ పరిస్థితులు వెలుగుచూస్తాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

జిల్లా	పాఠశాలలు	సర్వే చేస్తున్న విద్యార్థులు
ఖమ్మం	1,170	80 మంది
భద్రాద్రి కొత్తగూడెం	530	72 మంది

బూడిదే మిగులుతోంది!

- ఏటా ఏజెన్సీలో అగ్ని ప్రమాదాలతో తీవ్ర నష్టం
- ఇళ్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగులుతున్న బాధితులు
- అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- చర్ల, గుండాల, ములకలపల్లిలో ఏర్పాటు చేయాలని విన్నపం



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న ఇల్లు (ఫైల్)

చర్ల: ఏజెన్సీలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సుదూర ప్రాంతాల్లోని కేంద్రాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలను ఆర్పేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. భద్రాచలం, అశ్వారావుపేట, పినపాక నియోజకవర్గాల్లోని చర్ల, వెంకటాపురం, వాజేడు, ములకలపల్లి, దమ్మపేట, గుండాల, ఆళ్లపల్లి మండలాలు అగ్నిమాపక కేంద్రాలకు దూరంగా ఉన్నాయి. ఆయా మండలాల్లో వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలల్లో తీవ్రమైన ఆస్తినష్టం సంభవిస్తోంది.

ఫైరింజన్లు వచ్చేసరికి నష్టం జరిగిపోతోంది..

భద్రాచలం నియోజకవర్గం కేంద్రంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి దుమ్ముగూడెం 20 కిలోమీటర్లు, చర్ల 55 కిలోమీటర్ల దూరంలో ఉండగా, వెంకటాపురం 110, వాజేడు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. పినపాక మండలంలో ఉన్న గుండాల, ఆళ్లపల్లి మండలాలకు కొత్తగూడెం అగ్నిమాపక కేంద్రం 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని ములకలపల్లి, దమ్మపేట మండలాలు కొత్తగూడెంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా మండలాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అంత దూరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలు ఆర్పేందుకు కనీసం గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. రహదార్లు సరిగా లేని ప్రాంతాలకు ఇంకా ఆలస్యం అవుతోంది. ఆలోపే అంతా అగ్గికి బుగ్గి అవుతోంది. దీంతో బాధితులు కట్టుబట్టలతో మిగులుతున్నారు. రూ. లక్షల్లో ఆస్తి నష్టం జరుగుతోంది. వేసవిలో ఇళ్లతోపాటు ధాన్యం కుప్పలు, మిర్చి కల్లాలు, పత్తి కూడా అగ్నికి ఆహుతవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏటా అగ్ని ప్రమాదాలతో సుమారు రూ.10 కోట్లకు పైగానే నష్టం వాటిల్లుతున్నట్లు అంచనా.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు

అగ్ని ప్రమాదాల నుంచి ఏజెన్సీలో ఆస్తులను కాపాడేందుకు అగ్ని మాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కేవలం జిల్లా, నియోజకవర్గ కేంద్రాలను తప్ప ఏజెన్సీలోని మండలాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఏర్పడ్డాక పినపాక నియోజకవర్గంలోని మణుగూరులో మాత్రమే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ నియోజకవర్గంలోని గుండాల, ఆళ్లపల్లి మండలాలను గాలికొదిలేశారు. భద్రాచలం నియోజకవర్గంలోని చర్ల, వెంకటాపురం ప్రాంతాలను కూడా పట్టించుకోవడంలేదు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఉన్న ములకలపల్లి, దమ్మపేట మండలాల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఏజెన్సీలో అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కాలి బూడిదవుతున్నాయి..



ఏటా చర్ల మండలంలో జరుగుతున్న అగ్ని ప్రమాదాల వల్ల ఆస్తులన్నీ కాలిబూడిదవుతున్నాయి. భద్రాచలం నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పే సరికి బూడిద మాత్రమే మిగులుతోంది. ప్రభుత్వం స్పందించి చర్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి.

–పి.సాంబశివరావు, ఆర్.కొత్తగూడెం

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



చర్ల మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి. ఏటా అగ్ని ప్రమాదాల్లో రూ. లక్షల్లో ఆస్తి నష్టం జరుగుతోంది. వందల సంఖ్యలో పేదలు, గిరిజనులు నిరాశ్రయులవుతున్నారు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించాలి.

–సాయికుమార్, తేగడ

ప్రతిపాదనలు పంపాం



జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో అదనంగా అగ్నిమాపక కేంద్రాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నియోజకవర్గ కేంద్రాలకు సుదూర ప్రాంతంలో ఉన్న చర్ల, గుండాల మండల కేంద్రాల్లో కూడా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నాం. త్వరలోనే మంజూరవుతాయి.

–ఎం.క్రాంతి కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

రేపటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

- గంట ముందే కేంద్రాల్లోకి అనుమతి
- తాగునీరు, ఫ్యాన్లు వంటి వసతులు కల్పించిన అధికారులు



ఓపెన్ స్కూల్ తరగతులు బోధిస్తున్న టీచర్ (ఫైల్)

ఖమ్మం సహకారగనర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 20నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 20నుంచి 26వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం పరీక్షలు జరగనుండగా, ఉదయం 9నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2–30నుంచి 5–30గంటల వరకు జరిగే పరీక్షలకు గంట ముందు నుంచే కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారు.

ఉద్యోగుల నియామకం

పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఎనిమిది కేంద్రాల్లో ఎనిమిది మంది చొప్పున, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. అలాగే, వేసవి నేపథ్యాన కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు వంటి వసతులు కల్పిస్తున్నారు. కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదని ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. కేంద్రాల సమీపాన జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.

'భూ భారతి'తో సత్వర పరిష్కారాలు

- సింగరేణి ఓసీ విస్తరణలో భూ సేకరణకు సహకరించాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కరకగూడెం: మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

మణుగూరు టౌన్/కరకగూడెం/పినపాక: భూ భారతి చట్టం రైతన్నలకు చుట్టంలా మారిందని, ఈ చట్టం ద్వారా రైతుల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం కరకగూడెం జెడ్పీ సెంటర్‌లో, పినపాక మండలం బయ్యారం క్రాస్‌రోడ్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. సింగరేణికి భూసేకరణ కోసం మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో తిర్లాపురం, మణుగూరు రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం సమన్యాయానికి సూచికగా నిలుస్తుందని, సాగు భూమికి రక్షణ కవచంలా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ బిల్డింగులకు, ప్రభుత్వ పాఠశాలలకు, అభివృద్ధి పనులకు కేటాయించడానికి ఉపయోగపడుతుందన్నారు. భూ హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ ఉంటుందని వివరించారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులు కూడా పరిష్కారమవుతాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీలు వ్యవస్థ ఉంటుందన్నారు. మణుగూరు ఓసీ విస్తరణ కోసం భూ సేకరణకు నిర్వాసితులు సహకరించాలని కోరారు. నిర్వాసితుల విజ్ఞప్తి మేరకు తిర్లాపురంలో సేకరించే భూములకు పట్టణంలో మాదిరిగా ఎకరాకు రూ.22.5లక్షల వరకు చెల్లించేందుకు కృషి చేస్తామని, సింగరేణిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. రైతులతోపాటు గిరిజన సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. బయ్యారం క్రాస్‌రోడ్‌లో మునగపంటను పరిశీలించి, సాగు చేసిన రైతు కొప్పుల వర్మను అభినందించారు. ఎమ్మెల్యే పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. ధరణి ద్వారా భూ సమస్యలు పరిష్కారం కావని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు, ఏడీఏ తాతారావు, తహసీల్దార్లు రాఘవరెడ్డి, నాగ ప్రసాద్, నగేష్, ఎంపీడీఓలు కుమార్, సునీల్ కుమార్, ఎస్‌డీసీ సుమ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావు, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, తిర్లాపురం మాజీ సర్పంచ్ పాయం కామరాజు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.



మణుగూరుటౌన్ : కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న సింగరేణి బాధితులు

ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయి..

సింగరేణిలో బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నాయని మున్సిపాలిటీ పరిధిలోని పీకే–1, బాపనకుంట, రాజుపేట, విఠల్‌రావ్ నగర్‌ల గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. సింగరేణి కోసం భూములు ఇచ్చే రైతుల ఇళ్లు కూడా ఉన్నాయని, కేవలం 50 మీటర్ల దూరంలో ఉండటం వల్ల మా ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దగ్గరగా బ్లాస్టింగ్ జరిగితే ఎలా నివసించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీ విస్తరణలో తమ నివాసాలు కూడా తీసుకుని, తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రావు నగర్, పీకే–1 సెంటర్ రైతులు, గ్రామస్తులు, సీపీఐ నాయకుడు దుర్గ్యాల సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంచాయతీ సిబ్బంది సస్పెన్షన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీలో ఓ అధికారి సరైన విచారణ చేయకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బేస్‌మెంట్ లేని లబ్ధిదారులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాడని ఆధునిక సాంకేతిక విచారణలో తేలింది. దీంతో పూసా జగదీష్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం విధుల నుంచి తొలగించారు. ఎక్కడైనా ఇలాంటి పొరపాట్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పోలీసుల సోదాలు


లాడ్జిలో తనిఖీ చేస్తున్న ఏఎస్పీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం రామాలయం పరిసర ప్రాంతాల్లోని బెల్ట్ షాపుల్లో శుక్రవారం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యాన పట్టణ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు బెల్ట్ షాపుల్లో నిల్వ ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్థానిక ఎక్సైజ్ శాఖ సీఐ షేక్ రహీమున్నీసా బేగంకు అప్పగించారు. అనంతరం పట్టణంలోని మూడు లాడ్జీలలో ఏఎస్పీ విక్రాంత్, తన సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అంతకముందు అంబేడ్కర్‌సెంటర్‌లో వాహనాలు తనిఖీ నిర్వహించి ట్రాఫిక్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శిగా రమేష్

మణుగూరు రూరల్: జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శిగా బీర రమేష్‌ను, మండల చైర్మన్‌గా భోగ వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి వాకపల్లి ప్రవీణ్‌బాబు నియమితులయ్యారు. శుక్రవారం మణుగూరులో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాలు అందజేశారు. జిల్లా చైర్మన్ ధూళిపూడి శివ ప్రసాద్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన వ్యాన్..

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామ పంచాయతీ ధర్మన్ననగర్ చెందిన మడవి మున్నా, అతడి మేనల్లుడు కోర్స సురేష్‌లు శుక్రవారం ద్విచక్రవాహనంపై పాల్వంచకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో జగన్నాధపురం గ్రామ శివారు తోగ్గూడెం రోడ్డులో పాల్వంచ వైపు వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయలు కాగా 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఏరియా, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మడవి నందా ఫిర్యాదు మేరకు చండ్రుగొండ మండలం రేపల్లేవాడకు చెందిన వ్యాన్ డ్రైవర్ ఇనుము నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

బాలుడిని ఢీకొట్టిన ట్రాక్టర్..

జూలూరుపాడు: రోడ్డు దాటుతున్న ఓ బాలుడిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో కాలు విరిగిన సంఘటన మండలంలోని భేతాళపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు నాగమల్లిఖార్జున్, త్రివేణి దంపతుల మూడేళ్ల కుమారుడు సిద్దు ఇంట్లో నుంచి బయటకు వచ్చి రోడ్డు దాటేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఊళ్లో రాత్రి పూట అక్రమంగా మట్టి తోలకాలు జరుపుతున్న ఓ ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టి కాలుపై నుంచి ట్రాక్టర్ ముందు టైర్ వెళ్లడంతో విరిగిపోయింది. ఈమేరకు సిద్దును కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు.

చోరీపై కేసు నమోదు

దమ్మపేట: దమ్మపేట గ్రామానికి చెందిన తాండ్ర నరసింహారావు రెండు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లి శుక్రవారం ఉదయం ఇంటికొచ్చాడు. ఈక్రమంలో ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లగా రూ.20 వేల విలువైన వెండి వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

భూ వివాదంలో పలువురిపై..

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో ఇటీవల భూ వివాదంలో అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యాన గురువారం రాత్రి పలువురిపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో 190/1 సర్వే నంబర్‌లో ఎకరం 20 కుంటల భూమికి సంబంధించి ఎన్నో ఏళ్లుగా భూమి గ్రామకంఠానిదని రెవెన్యూ అధికారులు కూడా సర్వే చేపట్టి మాకు ఇచ్చారని గ్రామస్తులు, తాతల కాలంగా మా కుటుంబానికి చెందిందని హరిప్రసాద్ కుటుంబసభ్యులకు గత కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యాన ఇటీవల హరిప్రసాద్ తన అనుచరులతో జేసీబీతో భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు రాగా రామచంద్రాపురం గ్రామస్తులకు, సారపాకకు చెందిన కొందరికి ఘర్షణ జరిగి దాడులు చేసుకున్నారు. గురువారం సామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు ఐటీసీ టీఎన్‌టీయూసీ నాయకుడు కనకమేడల హరిప్రసాద్‌తో పాటు ఐటీసీ ఉద్యోగులు, మరికొందరు 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఏడుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బోనస్.. భరోసా!




దమ్మపేట పేరంటాల చెరువు కింద సన్నరకం సాగు

గణనీయంగా పెరిగిన వరి సాగు విస్తీర్ణం
- బోనస్ అదనపు ఆదాయం కావడంతో ఆసక్తి
- దాదాపుగా సన్నరకాలే పండిస్తున్న వైనం
- లాభాలు ఆర్జిస్తున్న రైతాంగం

దమ్మపేట: రాష్ట్ర ప్రభుత్వం వరికి ప్రకటించిన బోనస్ కారణంగా జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో రైతులు వరి సాగు పట్ల ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో వరి సాగు చేయాలంటే అంత లాభదాయకమైన పంట కాదనే ఆలోచన రైతుల్లో ఉండేది. ఆరుగాలం కష్టపడి సాగుచేయగా చేతికందిన పంటను అమ్మితే వచ్చిన ఆదాయం ఖర్చులకు మాత్రమే సరిపోయేది. పంట బాగా పండినప్పటికీ, చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగి, రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఒక క్వింటా సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటుగా అదనంగా రూ.500 బోనస్‌ను ప్రకటించడంతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సన్న రకంకు మాత్రమే బోనస్ ఇవ్వడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపుగా సన్న రకం మాత్రమే సాగు చేస్తున్నారు. గత కొద్ది సంవత్సరాల వరకు ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేసిన రైతులు, రబీ(యాసంగి) సీజన్‌లో సాగునీరు లభ్యత ఉన్నప్పటికీ వరి సాగుకు రైతులు పెద్దగా ఆసక్తి కనబర్చేవారు కాదు. నేడు బోనస్ కారణంగా యాసంగిలో కూడా వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

పెరిగిన సాగు విస్తీర్ణం

జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడు ఖరీఫ్, రబీ(యాసంగి) రెండు సీజన్‌లోనూ వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో అధిక శాతం రైతులు పామాయిల్ సాగుపై ఆసక్తితో ఉన్నప్పటికీ.. వరిసాగు విస్తీర్ణం పెరగడానికి బోనస్ ప్రధాన కారణం అని చెప్పొచ్చు. గతంలో వరి పొలాలను కూడా పామాయిల్ క్షేత్రాలుగా మార్చిన సంఘటనలు అనేకం ఉన్నాయి. నేడు బోనస్‌తో పాటుగా పామాయిల్ దిగుబడి ఆశాజనకంగా లేకపోవడం కారణంగా తిరిగి వరి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)..

సంవత్సరం	ఖరీఫ్	రబీ
2024	1,61,157	60,927
2025	1,64,662	75,641

అదనపు ఆదాయం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌తో రైతులు అదనపు ఆదాయం పొంది లాభాలను అర్జిస్తున్నారు. ఒక ఎకరం వరి పొలం సాగు చేయడానికి విత్తనాలు, దుక్కి దున్నడం, నాటు వేయడం, ఎరువులు, కోతకూలి తదితర పనులకు కలిపి సుమారుగా రూ.30 వేలకుపైగా ఖర్చయి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇవన్నీ అమ్మగా.. రైతు శ్రమతో కలిపి పెట్టుబడి ఖర్చు వరకు వచ్చేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వం ఒక క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో అదనంగా రూ.12,500ల వరకు ఆదాయం వచ్చే అవకాశం కల్గుతుండడంతో వరిసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

యాసంగిలోనూ సన్న రకమే..

యాసంగిలో సాగు చేసిన వరి సాగులో సన్నరకం ధాన్యానికి అంతగా నాణ్యత ఉండదనే కారణంగా గతంలో ఎక్కువగా లావురకం ధాన్యాన్ని పండించేవారు. ఒకవేళ సన్న రకంను పండిస్తే, తక్కువ దిగుబడి రావడమే కాక ఆ ధాన్యాన్ని మిల్లు ఆడిస్తే వచ్చిన బియ్యం ముక్కలుగా విడిపోయి నూకలు మాదిరిగా అయ్యేవి. దీంతో వీటిని తినడానికి అంతగా ఆసక్తి చూపకపోగా మార్కెట్‌లో ధర కూడా అంతంత మాత్రంగా ఉండేది. లావురకాన్ని పండిస్తే, అధిక దిగబడితో పాటుగా నాణ్యత కూడా ఉండేది. ప్రస్తుతం బోనస్ ఇస్తున్నారనే ఏకైక కారణంగా యాసంగిలో కేవలం సన్నరకాన్నే రైతులు పండిస్తున్నారు.

ఇష్టంతో సాగు చేస్తున్నాం..



దమ్మపేట గ్రామంలోని పేరంటాల చెరువు ఆయకట్టు కింద నాకున్న ఎకరం భూమిలో వరి సాగు చేసేవాన్ని. గతంలో అంతగా లాభాలు లేకపోగా పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేది కాదు. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే దాదాపుగా నష్టపోయినట్లే. కానీ ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌తో ఖరీఫ్‌లో పెట్టిన పెట్టుబడి పోగా లాభం కూడా వచ్చింది. దీంతో యాసంగిలోనూ ఇష్టంతో వరి సాగు చేస్తున్నా.

– నక్కా వెంకటేశ్వరరావు, రైతు, దమ్మపేట

బోనస్‌పై మక్కువతో..



బోనస్‌పై మక్కువతో మండలంలోని చెరువుల పరిధిలోని ఆయకట్టు, వ్యవసాయ బోర్ల కింద వరి పొలం ఉన్న రైతులందరూ యాసంగిలోనూ దాదాపుగా సన్నరకం ధాన్యాన్నే సాగు చేస్తున్నాం. గతంలో ఖరీఫ్ సీజన్‌లో తప్ప యాసంగిలో వరి సాగు పట్ల నాకు అంతగా ఆసక్తి ఉండేది కాదు. ప్రస్తుతం దమ్మపేట శివారులో ఉన్న కొమ్మల చెరువు కింద మా వరిపొలంలో యాసంగిలోనూ వరిసాగు చేస్తున్నా.

– చిన్నశెట్టి కోటయ్య , రైతు, దమ్మపేట

ఆసక్తి పెరిగింది..



గతంతో పోలిస్తే వరి సాగు పట్ల రైతుల్లో ఆసక్తి పెరిగింది. బోనస్ కారణంగా సాగుకు యోగ్యమైన అన్ని ప్రదేశాల్లోనూ వరి సాగు చేస్తున్నారు. యాసంగి సీజన్‌లో సాగు నీరు లభ్యత ఉన్నప్పటికీ గతంలో వరి సాగుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. కానీ నేడు ఆ పరిస్థితి కనబడడం లేదు. ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పొచ్చు.

– శీలం చంద్రశేఖరరెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి

● చిగురిస్తున్న ఆశలు..


మొండికుంట అటవీ ప్రాంతంలో చిగురిస్తున్న తునికాకు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు అటవీ ప్రాంతంలోని తునికాకు చిగురిస్తోంది. దీంతో తునికాకు సేకరణకు అనుకూలంగా ఆకులు చిగురిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల నుంచి తునికాకు సేకరణకు ప్రజలు సిద్ధమవుతున్నారు. వేసవిలో గిరిజనులు, ప్రజలకు ఇదే జీవనాధారం కానుంది. – అశ్వాపురం

7.63 కిలోల ఎండు గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితుడితో అధికారులు

భద్రాచలంటౌన్: ఏపీలోని చింతూరు నుంచి భద్రాచలం మీదుగా మధ్యప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న నిషేధిత ఎండు గంజాయిని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.తిరుపతి కథనం ప్రకారం.. కూనవరం రోడ్డులోని ఇసుక రీచ్ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 7.63 కిలోల ఎండు గంజాయి లభించింది. పట్టుబడిన వ్యక్తిని విచారించగా మధ్యప్రదేశ్‌కు చెందిన బ్రిజేష్ ఏపీలోని చింతూరులో గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయి కొని మధ్యప్రదేశ్‌లోని విదిశాకు బైక్‌పై తరలిస్తున్నట్లు చెప్పాడు. ఈమేరకు సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి ఒక సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం, గంజాయిని స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని, గంజాయి విలువ సుమారు రూ.1.90 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

10 లీటర్ల నాటుసారా..

బూర్గంపాడుకు చెందిన గుండె రాజేష్, రేపాకుల సంతోష్‌లు ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారాను సారపాకకు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది కరీం, సుధీర్, హరీష్, వెంకట్, హనుమంతరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత?

అశ్వారావుపేట: ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా రవాణా అవుతున్న నిషేధిత గంజాయిని అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. శుక్రవారం ఉదయం ఏపీ వైపు నుంచి ఖాళీగా వస్తున్న ఓ లారీలో టార్పాలిన్ పట్టా కింద సుమారు 400 కిలోల గంజాయిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో దాడి చేయగా లారీ గంజాయితో సహా పట్టుబడినట్లు తెలిసింది. కాగా, ఇట్టి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు.

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డాడు. సీఐ రమేష్ వెల్లడించిన వివరాలు.. మధిరకు చెందిన రాజకొండ దుర్గారావు కొన్నేళ్లుగా బొక్కలగడ్డ వెంకటేశ్వర్‌నగర్‌లో ఉంటూ చిరువ్యాపారం చేస్తున్నాడు. అయితే, త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో విజయవాడ నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నాడు. ఈనేపథ్యాన పెట్రోలింగ్ చేస్తున్న ఎస్‌ఐ రమేష్ ఆయనన తనిఖీ చేయడంతో రూ.20వేల విలువైన 450 గ్రాముల గంజాయి లభించింది. దీంతో నిందితుడు దుర్గారావును అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

కంటైనర్, కారు ఢీ..


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


గుంతలను పూడ్చిస్తున్న ఎస్‌ఐ రవి, పోలీస్ సిబ్బంది

జూలూరుపాడు: కంటైనర్, కారు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన తల్లాడ–కొత్తగూడెం ప్రధాన రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కంటైనర్, భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్లే కారు జూలూరుపాడు సబ్ మార్కెట్ యార్డు సమీపంలోకి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ప్రధాన రహదారిపై ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలు కారణంగా కంటైనర్, కారు ఢీకొన్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి ఘటనాస్థలానికి చేరుకుని తన పోలీస్ సిబ్బందితో పాటు కూలీలతో కలిసి గుంతలను పూడ్చించారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత..

13 మందిపై కేసు నమోదు


పట్టుబడిన ట్రాక్టర్లు, డ్రైవర్లు

టేకులపల్లి: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను శుక్రవారం టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. టేకులపల్లి ఎస్‌ఐ అలకుంట రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శంభునిగూడెం ముర్రేడు వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న శంభునిగూడెం, సూర్యాతండా, కూనారం, చంద్రుతండా, మంగ్యతండాలకు చెందిన ఏడు ట్రాక్టర్లను సులానగర్‌లో నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు డ్రైవర్లు, యజమానులు గుగులోత్ సురేష్, గుగులోత్ సర్దార్, బానోత్ హత్తిరామ్, బానోత్ రమేష్, గుగులోత్ శివ, గుగులోత్ గన్యా, గుగులోత్ పవన్‌కల్యాణ్, గుగులోత్ భద్రు, పాయం సర్వేష్, బోడ మంగ్య, కంగల రాము, ఇలాసాగర్ కృష్ణ, బానోత్ శంకర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్, మట్టి లారీలు..

బూర్గంపాడు: మండల పరిధిలోని మోతె పట్టీనగర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు తప్పవని ఎస్‌ఐ రాజేశ్ హెచ్చరించారు. అలాగే మండల పరిధిలోని టేకులచెరువు గ్రామ సమీపాన సీతారామ ప్రాజెక్ట్ కాలువ మట్టిని రెండు టిప్పర్లలో తరలిస్తుండగా.. శుక్రవారం ఉదయం ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టుకున్నారు. లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అనారోగ్య కారణాలతో ఆత్మహత్య

చింతకాని: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం నాయకులగూడెంకు చెందిన వడుగు అజయ్‌కృష్ణ (34) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చింతకాని మండలం చిన్నమండవకు చెందిన లక్ష్మీతిరుపతమ్మను 13ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్న ఆయన ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం చిన్నమండవ వచ్చాడు. ఇక్కడ వెల్డింగ్ పనులతో జీవనం సాగిస్తుండగా మద్యానికి బానిసైన అజయ్‌కృష్ణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం వెల్డింగ్ పనుల కోసం నాగులవంచ వెళ్తున్నట్లు చెప్పి అక్కడే పురుగుల మందు తాగాడు. స్థానికుల ద్వారా తెలుసుకున్న కుటుంబీకులు ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. అజయ్‌కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఉరి వేసుకుని..

ఇల్లెందు: పట్టణంలోని రెండో వార్డు ఇల్లందులపాడులో సురేష్(30) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఏడాది వయస్సు కలిగిన కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా మద్యం మత్తులో ఆయన బలవన్మరణానికి పాల్పడినట్లు తెలిసింది.

చర్లలో..

చర్ల: మండలంలోని కలివేరు గ్రామానికి చెందిన గొడెం కమల్ (45) ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. కమల్ గురువారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకోగా బయటకు వెళ్లి వచ్చిన భార్య చూసి ఇరుగుపొరుగు వారికి చెప్పింది. దీంతో వారు కిందకు దించి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. నిత్యం మద్యం తాగొచ్చి గొడవపడుతుండేవాడని ఈ క్రమంలో గురువారం కూడా గొడవ పెట్టుకొని ఆమె ఇంట్లో లేని సందర్భంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య తెలిపింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య


బండి అనిల్ (ఫైల్)

అశ్వాపురం: జీవితం మీద విరక్తితో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం మండల పరిధి మల్లెలమడుగుకు చెందిన బండి అనిల్(34) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో 17న ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొండికుంట గ్రామ సమీపాన పొలాల్లో అనిల్ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండడాన్ని చూసిన గేదెల కాపరులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ అశోక్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, మృతదేహం దుర్వాసన వస్తుండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో మహిళ..


జాన్‌బీ(ఫైల్)

జూలూరుపాడు: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఓ మహిళ ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలూరుపాడుకు చెందిన షేక్ జాన్‌బీ(53) గత కొన్ని రోజులుగా ఉపాధి పనులకు వెళ్తుంది. ఈ క్రమంలో రోజుమాదిరిగానే ఈనెల 15న పనికి వెళ్లి ఇంటికి వచ్చి రాత్రి నిద్రకు ఉపక్రమించింది. అదేరోజు రాత్రి తెల్లవారుజామున ఆమె శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా.. కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై ఖమ్మంకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. గత ఐదేళ్ల క్రితం జాన్‌బీకి బ్రెయిన్ ఆపరేషన్ జరిగినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. మృతురాలికి భర్త జానీ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు..


యాకూబ్ (ఫైల్)

బోనకల్: భర్త వదిలేసినా, ఇద్దరు కుమారులు మానసిక వైకల్యంతో బాధపడుతున్నా బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ మహిళ కుమారుడిని బావి మింగేసింది. ఆ కుటుంబంతో పాటు, స్థానికంగా విషాదాన్ని నింపిన ఈ ఘటన వివరాలు... జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన షేక్ రేష్మాకు ఓ కుమార్తెతో పాటు మానసిక దివ్యాంగులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఆమెను భర్త వదిలివేసినా అధైర్యపడకుండా పిల్లలతో కలిసి చింతకాని మండలం ప్రొద్దుటూరుకు వచ్చి గుడారం వేసుకుని జీవనం సాగిస్తోంది. పాత రాతెండి సామగ్రి కొనడం, మరమ్మతు పనులతో పొట్ట పోసుకుంటుండగా, శుక్రవారం పెద్దకుమారుడు యాకూబ్(15) బోనకల్ మండలం లక్ష్మీపురం పరిధి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. దీంతో నీటమునిగిన ఆయన మృతి చెందగా తల్లి సహా కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, వారి కుటుంబ పరిస్థితి దృష్ట్యా మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు బీఆర్‌ఎస్ నాయకుడు పెంట్యాల పుల్లయ్య ఆటో సమకూర్చగా, స్థానికులు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుబాబు తెలిపారు.

బావిలో పడి గుర్తుతెలియని వ్యక్తి..


మృతుడి ఫైల్

తిరుమలాయపాలెం: కొద్ది రోజులుగా మండలంలోని మేడిదపల్లి ప్రాంతంలో తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తి(30) వ్యవసాయ బావిలో మృతదేహంగా తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మతిస్థిమితం లేని సదరు వ్యక్తి మేడిదపల్లిలో తిరుగుతూ ఎవరైనా భోజనం పెడితే తినేవాడు. ఈక్రమాన మేడిదపల్లి – మేకలతండా మార్గంలో వ్యవసాయ బావిలో ఆయన మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. ఈమేరకు పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని వెలికితీసి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59136, 87126 59137 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ సూచించారు.

రెండు మందుపాతరల గుర్తింపు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం పోలీసు బలగాలు రెండు మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేశాయి. బీజాపూర్ జిల్లా మూడి మార్గంలో కోబ్రా 205 బెటాలియన్ బలగాలు తనిఖీ చేస్తుండగా 1.5 కిలోల సామర్థ్యం కలిగిన రెండు బీరు బాటిల్ బాంబులను గుర్తించారు. ఈమేరకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వాటిని అక్కడే నిర్వీర్యం చేశారు.

లైఫ్@360

రోజంతా ఉల్లాసంగానే...



చాలామంది రోజంతా నీరసంగా.. నిస్సత్తువగా గడుపుతుంటారు. దీనివల్ల శరీరం నిస్తేజంగా మారడమే కాకుండా అనేక రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అయితే కొన్ని చిన్నపాటి మార్పుల ద్వారా రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండవచ్చు. అవేంటో చూద్దాం..



తగినంత నిద్ర.. ప్రతిరోజూ కనీసం 7–8 గంటలు నిద్ర పోవడం చాలా ముఖ్యం. నిద్రలేమి చిరాకు, నీరసానికి దారితీస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం.. పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు శరీరానికి శక్తినిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర ఎక్కువగా ఉండే వాటిని తగ్గించడం మంచిది.



వ్యాయామం.. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. నడవడం, యోగా, డ్యాన్స్ లేదా ఇష్టమైన ఏదైనా శారీరక శ్రమ చేయవచ్చు.

నీరు తాగడం.. రోజంతా తగినంత నీరు తాగడం చాలా అవసరం. డీహైడ్రేషన్ వల్ల అలసట, చిరాకు కలగవచ్చు.

ధ్యానం, విశ్రాంతి.. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం లేదా రిలాక్సేషన్ టెక్నిక్స్ కోసం కేటాయించండి. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.

పాజిటివ్ ఆలోచనలు.. ప్రతికూల ఆలోచనలను తగ్గించుకుని సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోండి. కృతజ్ఞత కలిగి ఉండటం కూడా చాలా ముఖ్యం.

ఇష్టమైన పనులు చేయడం.. ఆనందం కలిగించే హాబీలు లేదా పనుల కోసం సమయం కేటాయించడం మన మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది.

సామాజిక సంబంధాలు.. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ఇతరులతో మాట్లాడటం, కనెక్ట్ అవ్వడం మానసిక ఆరోగ్యానికి చాలా ముఖ్యం.

కొత్త విషయాలు నేర్చుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం లేదా కొత్త విషయాలు తెలుసుకోవడం మీ మనస్సును ఉత్తేజపరుస్తుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

రోజువారీ అలవాట్లు.. ఉదయం లేవగానే సహజమైన సూర్యకాంతిలో గడపడం శరీరపు జీవ గడియారాన్ని క్రమబద్ధీకరించడానికి సహాయపడుతుంది, ఉల్లాసంగా ఉంచుతుంది.

చిన్న చిన్న విరామాలు.. మీరు ఎక్కువసేపు ఒకే పనిలో ఉంటే, మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. లేచి కొంచెం నడవండి లేదా స్ట్రెచ్ చేయండి.

పనులు ప్లాన్ చేసుకోవడం.. రోజువారీ పనులను ఒక క్రమంలో ప్లాన్ చేసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, మరింత నియంత్రణలో ఉన్నట్లు అనిపిస్తుంది.

నవ్వండి, నవ్వించండి.. నవ్వడం ఒక గొప్ప ఒత్తిడి నివారిణి, హాయిగా నవ్వుకోడం మానసిక స్థితిని తక్షణం మెరుగుపరుస్తుంది.

ఈ చిట్కాలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా రోజంతా ఉల్లాసంగాఉత్సాహంగా ఉండగలగడం ఎవరికైనా సాధ్యమే.ఒకవేళ మీకు ఏవైనా ప్రత్యేకమైన ఆందోళనలు ఉంటే, వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.



ప్రాణాయామంతో మనస్సు, శరీరం రీఛార్జ్

● యోగా



యోగాలో ప్రాణాయామం ప్రయోజనాలు యోగాకు మించి ఉంటాయి. శ్వాస మీద పని చేస్తున్నప్పుడు, శరీరంలోని టాక్సిన్స్‌ను తొలగిస్తూనే తగినంత ఆక్సిజన్ సరఫరాతో శ్వాసను నియంత్రించడం, సరైన విధంగా సాధన చేయడం ఈ యోగాలో కీలకం. శరీరాన్ని రీఛార్జ్ చేయడం ద్వారా ఇది పనిచేస్తుంది. ప్రాణాయామం జీర్ణాశయానికి ఆక్సిజన్ సరఫరాను పెంచుతుంది, మెరుగైన జీర్ణక్రియ కోసం రక్త ప్రవాహాన్ని, ప్రేగుల బలాన్ని పెంచుతుంది. యోగా ఆసనాలతో కలిపి చేసే ప్రాణాయామం ఒత్తిడిని తగ్గిస్తుంది. జీవక్రియ వ్యర్థాలను తొలగిస్తుంది.

సాధన చేయడానికి...

ప్రాణాయామం చేయడానికి, ఒక ప్రశాంతమైన స్థానంలో కూర్చొని, వెన్నును నిటారుగా ఉంచాలి. రెండు కళ్ళను మూసి, శ్వాసను లోపలికి పీల్చుకోవాలి. కొన్ని క్షణాలు ఆ శ్వాసను బిగించి, తర్వాత నెమ్మదిగా బయటకు వదిలేయాలి. ఈ ప్రక్రియను పదే పదే పునరావృతం చేయడం వల్ల శరీరానికి, మనసుకు ప్రశాంతత చేకూరి శక్తిమంతం అవుతాయి. శ్వాస సాధన ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

మెరుగైన ఆరోగ్యానికి మల్బరీ జ్యూస్



తియ్య తియ్యగా... పుల్ల పుల్లగా ఉండే మల్బరీ పండ్లు అన్ని కాలాలలోనూ అందుబాటులో ఉంటాయి. మల్బరీ పండ్లతో చేసిన జ్యూస్ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. అవేమిటో చూద్దాం..

మల్బరీలో ఉండే డైటరీ ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకం, కడుపులో మంటలను తగ్గిస్తుంది.

గుండె ఆరోగ్యానికి మల్బరీ యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉండి రక్తనాళాల పనితీరును మెరుగుపరచి రక్తం గడ్డ కట్టకుండా చేస్తుంది. తద్వారా స్ట్రోక్స్, గుండెపోటు వంటి సమస్యలను నివారిస్తుంది.

రోగనిరోధక శక్తి పెంపు: మల్బరీలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని వ్యాధులకు వ్యతిరేకంగా శక్తిమంతమైన రక్షణను అందిస్తుంది.

ఎముకల ఆరోగ్యానికి: మల్బరీలోని విటమిన్ కె, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి మంచిది.

కంటి చూపు మెరుగు: మల్బరీ జ్యూస్‌లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది కాబట్టి ఇది తాగడం వల్ల చూపు మెరుగుపడుతుంది. కంప్యూటర్ ముందు గంటల తరబడి పనిచేసే వారికి కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

వేగంగా కోలుకోవడానికి తోడ్పడుతుంది: శస్త్రచికిత్స తర్వాత రోగులకు మల్బరీ జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.

జుట్టు సహజ రంగును నిలుపుకుంటుంది: మల్బరీ జుట్టులో మెలనిన్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు సహజ రంగును నిలుపుకోవడానికి సహాయపడుతుంది, జుట్టు నెరిసిపోవడాన్ని తగ్గిస్తుంది.

మెదడు ఆరోగ్యానికి మంచిది: మల్బరీలో న్యూరోప్రొటెక్టివ్ లక్షణాలను కలిగి ఉన్న వివిధ బయో యాక్టివ్ సమ్మేళనాలు మెదడు కణాలను ఒత్తిడి నుంచి రక్షించి ఐక్యూను మెరుగుపరుస్తాయి. మల్బరీలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి, నష్టం నుంచి రక్షించడంలో సహాయపడతాయి. ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

చివరగా... ప్రయోజనాలు ఉన్నాయి కదా అని ఈ జ్యూస్‌ని విపరీతంగా తాగ కూడదు. పరిమితి పాటించడం మంచిది.

మండే ఎండల్లోనూ ఆరోగ్యంగా...

ఎండాకాలం కాసేపు బయటికి వెళితే చాలు ముఖచర్మం కమిలిపోతుంది. విపరీతంగా చెమటలు పోస్తాయి. నీరసం, నిస్త్రాణ కలుగుతాయి. కాసేపు పని చేస్తే చాలు శరీరం అలసిపోయి, సొమ్మసిల్లినట్లు అవుతుంది. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు కొన్ని చిట్కాలు పాటిస్తే ఎండల్లోనూ ఆరోగ్యంగా ఉండవచ్చు. అవేమిటో చూద్దాం...



- మంచినీటిని మించిన ఔషధం లేదు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడేది మంచినీరు మాత్రమే. కాబట్టి ఇప్పటినుంచీ దాహం వేసినా వేయకపోయినా వీలైనంత ఎక్కువగా నీళ్ల తాగడం అలవాటుగా మార్చుకోండి.
- గుప్పెడు పుదీనా ఆకులను తాగే నీటిలో వేసుకుంటే... శరీరం చల్లగా ఉంటుంది. ఈ కాలంలో పుదీనా టీని ఎంచుకుంటే మరీ మంచిది. ఎండ ప్రభావాన్ని కొంతవరకూ తట్టుకోగలుగుతారు.
- నిమ్మరసం వేసవికి ఔషధం లాంటిది. ఉదయాన్నే గ్లాసు నీటిలో కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.



సాక్షి సినిమా

అప్పనా తనామనా పాట బాగుంది

- సుకుమార్



● సువిక్షిత్, సుకుమార్, గీతిక

''**దూ**రదర్శిని' హీరో సువిక్షిత్ నా రూపం వచ్చేటట్లు వరిపొలంలో ఫార్మింగ్ చేశాడు. అప్పటి నుంచి తనతో నాకు పరిచయం ఉంది. తనకి సినిమా అంటే ప్యాషన్. ఈ మూవీ నుంచి నేను రిలీజ్ చేసిన 'అపనా తనామనా...' పాట చాలా బాగుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అని దర్శకుడు సుకుమార్ అన్నారు. సువిక్షిత్ బొజ్జ, గీతికా రతన్ జంటగా నటించిన చిత్రం 'దూరదర్శని'. 'కలిపింది ఇద్దరిని' అనేది ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకత్వంలో బి. సాయి ప్రతాప్ రెడ్డి, జయ శంకర్ రెడ్డి నిర్మించారు. ఆనంద్ గుర్రాన సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'అపనా తనామనా...' అనే పాట లిరికల్ వీడియోను సుకుమార్ విడుదల చేశారు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని సింధుజ, శ్రీనివాసన్ ఆలపించారు. సువిక్షిత్ బొజ్జ మాట్లాడుతూ– ''నా అభిమాన దర్శకుడు సుకుమార్‌గారి చేతుల మీదుగా మా మూవీ సాంగ్ రిలీజ్ కావడం సంతోషంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా అందర్నీ 90వ దశకంలోకి తీసుకెళ్లి మీ జ్ఞాపకాల్ని, ప్రేమకథలను గుర్తుకు తెస్తుంది''అని తెలిపారు.

కథ గమ్మత్తుగా అనిపించింది

- నవీన్ చంద్ర



● రాకేశ్ వర్మ, రాశీ సింగ్, నవీన్ చంద్ర

''**బ్లైండ్** స్పాట్' మంచి థ్రిల్లర్ మూవీ. రాకేష్ కథ చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఈ మూవీ స్క్రీన్‌ప్లే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఈ సినిమా నాకు వైవిధ్యమైన అనుభూతి ఇచ్చింది. కథను నమ్మి ఒక్కొక్క సినిమా చేసుకుంటూ ముందుకు వస్తున్నాను. ఎప్పటిలాగే 'బ్లైండ్ స్పాట్'కి కూడా ప్రేక్షకుల ప్రోత్సాహం ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నారు నవీన్ చంద్ర. రాకేష్ వర్మ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రాశీ సింగ్ జోడీగా నటించిన చిత్రం 'బ్లైండ్ స్పాట్'. మ్యాంగో మాస్ మీడియా బ్యానర్‌పై రామకృష్ణ వీరపనేని నిర్మించారు. శుక్రవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో **నవీన్ చంద్ర మాట్లాడుతూ–** ''మా సినిమా పోస్టర్లో ఒక క్లూ ఉంది. అది కనిపెట్టి నాకు మెసేజ్ చేస్తే వాళ్లతో కలిసి నేను ఈ చిత్రం చూస్తాను'' అన్నారు. **రాశీ సింగ్ మాట్లాడుతూ–** ''ఈ సినిమా అంతా నా పాత్ర ఏడుస్తూనే ఉంటుంది. సినిమా బాగా వచ్చింది'' అని చెప్పారు. **రాకేష్ వర్మ మాట్లాడుతూ–** ''మా సినిమా కథ మొత్తం ఒక రాత్రిలో జరుగుతుంది. నవీన్ చంద్ర తన పాత్రలో చాలా లీనమై నటించారు. రాశీ సింగ్ గ్లిజరిన్ లేకుండా కన్నీళ్లు తెచ్చుకునేంత మంచి నటి'' అన్నారు.

వాళ్లు ఐ లవ్ యూ చెప్పలేదు

- కమల్‌హాసన్



● అభిరామి, షణ్ముగమూర్తి, ఏఆర్ రెహమాన్, మణిరత్నం, కమల్‌హాసన్, త్రిష, శింబు

''**థగ్** లైఫ్' సినిమాలో శింబు, త్రిష, అభిరామి, జోజు జార్జ్ వంటి నటీనటులతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. అయితే ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు (త్రిష, అభిరామి) ఉన్నప్పటికీ నాకు ఒక్కసారి కూడా వారు ఐ లవ్ యూ చెప్పలేదు. కానీ, జోజు జార్జ్ మాత్రం రోజూ ఐ లవ్ యూ చెప్పేవారు'' అని కమల్‌హాసన్ సరదాగా పేర్కొన్నారు. కమల్‌హాసన్ హీరోగా ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, జోజు జార్జ్, అభిరామి ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. మద్రాస్ టాకీస్, రాజ్‌కమల్ ఫిలింస్ ఇంటర్నేషనల్ బ్యానర్స్‌పై కమల్ హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ అనంత్ నిర్మించిన ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ రిలీజ్ చేస్తోంది. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. శుక్రవారం చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూవీ నుంచి 'జింగుచ్చా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి కమల్‌హాసన్ సాహిత్యం అందించారు. ఈ సందర్భంగా **కమల్‌హాసన్ మాట్లాడుతూ–** ''నాయగన్' తర్వాత మళ్లీ మణిరత్నంగారి దర్శకత్వంలో నటించడానికి ప్రేక్షకులే కారణం. ఆయనకు, నాకు మధ్య ఇప్పటికీ ఏమీ మారలేదు. 'థగ్ లైఫ్' కచ్చితంగా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. **మణిరత్నం మాట్లాడుతూ–** ''కమల్‌హాసన్ సినిమా లవర్. డబ్బింగ్ జరుగుతుంటే నా ఆఫీస్‌కు వచ్చిన కమల్‌హాసన్ అమెరికాలో జరుగుతున్న సౌండ్ మిక్సింగ్ గురించి చెప్పారు. ఆయన దర్శకుడికి 50 శాతం భారాన్ని తగ్గిస్తారు'' అన్నారు. **త్రిష మాట్లాడుతూ–** ''మణిరత్నంగారి దర్శకత్వంలో నేను నటించిన మూడవ చిత్రం 'థగ్ లైఫ్'. అదేవిధంగా కమల్‌హాసన్‌గారు, శింబుతోనూ నటించిన మూడో చిత్రం ఇది కావడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ''కమల్‌హాసన్‌గారి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను'' అని శింబు తెలిపారు. ఈ వేడుకలో నటీనటులు అభిరామి, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, కెమేరామేన్ రవి కె.చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

– 'సాక్షి' తమిళ సినిమా, చెన్నై



● తమ్మిరాజు, సునీల్ బలుసు, కల్యాణ్‌రామ్, శ్రీకాంత్, అశోక్ వర్ధన్, ప్రదీప్ చిలుకూరి


మా అబ్బాయి మాటలతో షాక్ అయ్యా

- కల్యాణ్ రామ్

''**అర్జున్** సన్నాఫ్ వైజయంతి' సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మా నందమూరి అభిమానులకు ధన్యవాదాలు. మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది'' అని హీరో కల్యాణ్ రామ్ చెప్పారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్ జంటగా విజయశాంతి, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. అదే రోజు సాయంత్రం నిర్వహించిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో **కల్యాణ్ రామ్ మాట్లాడుతూ–**''మా అబ్బాయి ఈ సినిమా చూసి, 'ఇలాంటి సీక్వెన్స్ ఇండియన్ స్క్రీన్ మీద చూడలేదు... చాలా గర్వంగా ఉంది నాన్న' అని చెప్పాడు. ఆ రియాక్షన్‌కి నేను షాక్‌కి గురయ్యాను''అన్నారు. **నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ–**''ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకంతోనే మొదలుపెట్టాం. మా నమ్మకం నిజమైంది'' అని చెప్పారు. **ప్రదీప్ చిలుకూరి మాట్లాడుతూ–** ''ఈ మూవీకి ఆడియన్స్ నుంచి వస్తున్న రియాక్షన్ చూస్తుంటే గూజ్ బంప్స్ వస్తున్నాయి'' అన్నారు. **సునీల్ బలుసు మాట్లాడుతూ–** ''చాలా కాలం తర్వాత థియేటర్స్ అన్నీ మళ్లీ మా సినిమాతో ఫుల్ అవుతున్నాయి అని డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కాల్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. సాయంత్రం నుంచే అన్ని చోట్ల షోలు యాడ్ అవుతున్నాయి'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్ ముప్పా, ఎడిటర్ తమ్మిరాజు పాల్గొన్నారు.

మేలో శుభం

హీరోయిన్ సమంత నిర్మించిన తొలి చిత్రం 'శుభం' విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. హర్షిత్ రెడ్డి, సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి నటించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మించారు. ఈ మూవీని మే 9న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ''వినోదాన్ని అందించే చిత్రాలను రూపొందించడమే నా లక్ష్యం. 'శుభం' ఆ కోవలోకి వస్తుంది. ఈ చిత్రం కోసం నా టీమ్ చాలా కష్టపడింది. ఈ కథను అందరితో పంచుకోవడానికి మేం సంతోషిస్తున్నాం''అన్నారు సమంత.



● 'శుభం' సినిమా పోస్టర్

ఓటీటీ

ఇది చూడొచ్చు

చరిత్రలో చెరిగిపోని వీరుడు చావా

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం చావా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా అనేది మన జీవిత ప్రతిబింబం. మన జీవితంలో ఎన్నో రకాల భావావేశాలు, వాటికి కారణమైన కథనాలు ఎన్ని ఉంటాయో వాటన్నిటినీ మళ్లీ నాటకీయంగా రూపకల్పన చేసి, నటీనటులను అవే కథనాలలో నటింపజేసి మన జీవితాన్ని మనకే అద్దంలో చూపించే మహా ప్రయత్నమే సినిమా. చిన్నప్పుడు బామ్మ ఒళ్లో చందమామను చూస్తూ చెప్పే కథలు చక్కగా ఎందుకు వింటామో తెలుసా... ఎక్కువగా చరిత్రలోని కథనాలే ఆవిడ మనకి చెప్పారు కాబట్టి. మన చరిత్రలో మన పూర్వీకుల వీరత్వం ఉంది. ఆ వీరత్వం మాటున బోలెడంత పోరాటం ఉంది. ఆ పోరాటం వెనక దాగి ఉన్న పట్టుదలతో కూడిన త్యాగం ఉంది. ఆ త్యాగంలో కనబడని బాధ, కనిపించే ఆనందంలాంటివి ఎన్నో ఉన్నాయి. అటువంటి పోరాటాలను అడపా దడపా నేటి దర్శకులు సినిమాల రూపంలో మన ముందుకు తీసుకువస్తున్నారు. ఆ కోవకు చెందినదే 'చావా' చిత్రం. ఛత్రపతి శివాజీ పేరు చాలా మందికి తెలుసు. కానీ శివాజీ మహారాజ్ కొడుకు శంభాజీ గురించి అందరికీ తెలియజేసేలా ఈ సినిమా ఉంటుంది. సినిమా ఆరంభంలోనే నాటి మొఘలు సామ్రాజ్యానికి చెందిన ఔరంగజేబుకు ఓ వార్త అందుతుంది. భారతదేశం మూలమూలలా కబళించిన మొఘలులు మరాఠాల ప్రాంతంలో మాత్రం అడుగు కూడా పెట్టలేకపోతారు. దానికి కారణం ఛత్రపతి శివాజీ. ఆయన ఇక లేరన్న వార్త ఔరంగజేబుకు అమృతంలా అందుతుంది. వార్త విన్న ఆనందం ఆస్వాదించేలోపే శివాజీ కొడుకు శంభాలా గురించి కూడా ఔరంగజేబుకు తెలుస్తుంది. దాంతో ఔరంగజేబు తన కిరీటాన్ని తీసేసి, శంభాలాను చంపిన తర్వాతే తాను మళ్లీ కిరీటాన్ని పెట్టుకుంటానని ప్రతిన బూనుతాడు. ఆ తర్వాత శంభాలాని ఔరంగజేబు కుట్రతో ఎంత దారుణంగా చంపుతాడనేదే ఈ సినిమా. లక్ష్మణ్ ఉతేకర్ ఈ సినిమాకి దర్శకుడు. ప్రముఖ వర్ధమాన నటుడు విక్కీ కౌశల్ శంభాలా పాత్రలో ఒదిగిపోయారు. ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా కూడా అద్భుతంగా ఒదిగిపోయారు. అలాగే ఔరంగజేబు పాత్రలో అక్షయ్ ఖన్నా జీవించారు. ఇక సినిమా పరంగా ప్రతి క్షణం ప్రేక్షకుడిని ఉద్వేగపరుస్తూ చివర్లో కన్నీటితో సాగనంపుతారు దర్శకుడు. అయితే ఇది కథాపరంగా మాత్రమే సుమా. గడిచిన పదేళ్లలో 'బాహుబలి'తో ప్రపంచ ఖ్యాతిని మూటగట్టుకున్న మన టాలీవుడ్ గురించే ప్రేక్షకులు మాట్లాడుకుంటున్న ఈ తరుణంలో 'చావా' సినిమా మాత్రం దాదాపుగా అడుగంటిన బాలీవుడ్ ఖ్యాతిని ఒక్కసారిగా ఉలిక్కిపడుతూ లేపిందనే చెప్పాలి. ఈ సినిమా విడుదలకు ముందు తర్వాత కూడా ఎన్నో సంచలనాలకు దారి తీసిందన్న విషయం మనకు తెలుసు. 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమ్ అవుతున్న ఈ 'చావా' ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా, కాదు కాదు చూసి తెలుసుకోవాల్సిన చరిత్ర. తప్పనిసరిగా చూడాల్సిన చిత్రం.



– హరికృష్ణ ఇంటూరు